సాక్షి
వికారాబాద్
ఆదివారం। 19। ఫిబ్రవరి। 2023



వరి సాగుకే రైతుల మొగ్గు

జిల్లాలో వరి సాగు వైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగినట్లు తెలుస్తోంది. 8లో▸



రాక్షసగూళ్లు కనుమరుగు!

అబ్దుల్లాపూర్‌మెట్‌లోని మూడు వేల సంవత్సరాల క్రితం నాటి పురాతన రాక్షసగూళ్లు కనుమరుగవుతున్నాయి. 8లో▸



మల్చింగ్ సాగు.. లాభాలు బాగు

ఉద్యాన పంటల సాగులో మల్చింగ్ విధానం ద్వారా అనేక లాభాలున్నాయి. వేసవిలో ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. 9లో▸

న్యూస్‌రీల్

ఫాంహౌస్‌లపై ఎస్‌ఓటీ పోలీసుల దాడి

- మద్యం బాటిళ్లు స్వాధీనం
- ఆరుగురిపై కేసు నమోదు



ఓ ఫాంహౌస్‌లో ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి పట్టుకున్న మద్యం బాటిళ్లు

మొయినాబాద్: అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఫాంహౌస్‌లపై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. అనుమతి లేకుండా మద్యం వినియోగిస్తున్నవారిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కనకమామిడి సమీపంలో ఉన్న సెలబ్రిటీ ఫాంహౌస్, ఎటర్నిటీ ఫాంహౌస్, సజ్జన్‌పల్లి సమీపంలో ఉన్న ముషీరుద్దీన్ ఫాంహౌస్‌ల్లో శుక్రవారం రాత్రి ఎలాంటి అనుమతి లేకుండా మద్యం వినియోగిస్తున్నట్లు ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న వారు 44 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఫాంహౌస్‌లు నడుపుతున్న నిర్వాహకులు, యజమానులపై కేసులు నమోదు చేశారు. సెలబ్రిటీ ఫాంహౌస్ వాచ్‌మన్ సుధాకర్, యజమాని ప్రశాంత్, ఎటర్నిటీ ఫాంహౌస్ వాచ్‌మెన్ పటేల్ రాజు, యజమాని వై.నరేష్‌కుమార్‌రెడ్డి, ముషీరుద్దీన్ ఫాంహౌస్ వాచ్‌మన్ స్వామి, యజమాని ముషీరుద్దీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనల్ని అతిక్రమించిన పబ్‌లు

నలుగురిపై కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్ జోన్ పరిధిలోని 16 పబ్‌లలో సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్‌ఓటీ) పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇందులో హార్ట్ కప్, బర్డ్ బాక్స్ పబ్‌లు నిబంధనలను అతిక్రమించినట్లు పోలీసులు గుర్తించారు. హార్ట్ కప్ పబ్ నిర్వాహకులు మైనర్లను పబ్‌లోకి అనుమతి ఇస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో వెంటనే పబ్ యజమాని పవన్ కుమార్, మేనేజర్ ఆదిత్యా తమాంగ్‌లపై కేసులు నమోదు చేశారు. సరైన లైసెన్స్ లేకుండా నడుస్తున్న బర్డ్ బాక్స్ పబ్ యజమాని వంశీ వర్ధన్, మేనేజర్ పి.అర్జున్‌లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఓటీ డీసీపీ ఎంఏ రషీద్ తెలిపారు.

26న పర్యావరణ పరిరక్షణపై చిత్ర లేఖన పోటీలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పర్యావరణ పరిరక్షణపై ఈ నెల 26న ఉదయం 10 గంటలకు ఇందిరాపార్కులో ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలను నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.పి.హెచ్.రంగయ్య, గౌరవాధ్యక్షుడు ఉప్పల వెంకటేష్‌గుప్తా తెలిపారు. ఔత్సాహిక విద్యార్థులు తమ పేరు, వయసు, తరగతి, స్కూల్ తదితర వివరాలతో 83339 49623, 99663 31427 లను సంప్రదించాలని సూచించారు.

మెట్రో వేళల్లో మార్పులు

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో రైలు వేళలను తిరిగి సవరించినట్లు హైదరాబాద్ మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొన్నటి వరకు నాంపల్లి ఎగ్జిబిషన్ సందర్భంగా రాత్రి 12 గంటల వరకు మెట్రో రైళ్లు నడిచాయి. ప్రస్తుతం ఎగ్జిబిషన్ ముగియడంతో పాత పద్ధతిలోనే చివరి ట్రిప్పు రాత్రి 11 గంటలకు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎల్‌బీనగర్, మియాపూర్, నాగోల్, రాయదుర్గం, జేబీఎస్ టర్మినల్ స్టేషన్‌ల నుంచి చివరి మెట్రో రైళ్లు బయలుదేరుతాయి.



తాండూరు రూరల్: భూకైలాస్‌లోని మహాశివుడి భారీ విగ్రహానికి డ్రోన్ సాయంతో పుష్పార్చన



తాండూరు రూరల్: భూకైలాస్‌లో భక్తుల సందడి

ఓం నమః శివాయ

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని పంచాక్షరీ మంత్ర పారాయణంతో భక్తకోటిపులకించింది. సర్వేశ్వరుడి దర్శనం కోసం చిన్నాపెద్దా పోటీపడ్డారు. శనివారం ఉదయం నుంచే క్యూలైన్‌లో నిలబడి శివలింగానికి అభిషేకాలు చేశారు. వికారాబాద్ సమీపంలోని బుగ్గ రామలింగేశ్వరాలయం, పార్వతీపరమేశ్వరుల గుట్ట, మల్లికార్జున స్వామి ఆలయం, బషీరాబాద్ పరిధిలోని జీవన్గీ మహాదేవ లింగేశ్వరాలయం, నీళ్లపల్లిలోని ఏకాంబరి రామలింగేశ్వరాలయం, నావంద్గిలోని సంగమేశ్వరాలయం, అంతారంలోని భూకైలాస్, కొడంగల్‌లోని గాడిబాయి శివాలయాలు ఆది దేవుడి నామస్మరణతో మార్మోగాయి.



మర్పల్లి: బూచన్‌పల్లిలో శివలింగానికి పూజలు



పెద్దేముల్: శంభులింగేశ్వరాలయంలో దీపార్చన



వికారాబాద్ అర్బన్, అనంతగిరి: బుగ్గలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



దౌల్తాబాద్: ప్రత్యేక అలంకరణలో నీలకంఠుడు

‘కమలం’లో చీలికలు

పరిగిలో మొదలైన గ్రూపు రాజకీయాలు

- మూడు చోట్ల తెరుచుకున్న పార్టీ కార్యాలయాలు
- అయోమయంలో కార్యకర్తలు
- కేడర్‌ను కాపాడుకునే పనిలో సీనియర్లు



పరిగి: నియోజకవర్గంలో బీజేపీ శ్రేణులు రెండు, మూడు వర్గాలుగా విడిపోయాయి. ఆ పార్టీ తరఫున పరిగి అసెంబ్లీ బరిలో నిలవాలని భావిస్తున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరగడమే ఇందుకు కారణం. గతంలో ఇక్కడ బీజేపీ అంటే కేవలం ఒకరిద్దరు సీనియర్ నేతల పేర్లే వినిపించేవి. కానీ ప్రస్తుతం సీన్ మారిపోయింది. కాషాయ పార్టీ తరఫున ఎమ్మెల్యే టికెట్ కోసం చాలా మంది పోటీపడుతున్నారు. వీరిలో కొంతమంది ఇప్పటి నుంచే నియోజకవర్గంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరు కార్యకర్తలను రెండు గ్రూపులుగా విడగొట్టి కార్యక్రమాలు చేస్తున్నారని పలువురు సీనియర్ నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పార్టీని రెండుగా చీల్చి, ఎవరికి వారు కార్యక్రమాలు చేయడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో బీజేపీలో విభేదాలు మరింత ముదిరాయని చెప్పవచ్చు.

ఒకే పార్టీ మూడు ఆఫీసులు

నియోజకవర్గంలో బీజేపీకి మూడు కార్యాలయాలను ఏర్పాటు చేశారు. గతంలో పార్టీ అని చెప్పుకోవడానికి, జెండా మోయడానికి ఎవరూ లేని తరుణంలో పార్టీని నెట్టుకువచ్చిన సీనియర్ నాయకులు ఏం చేయాలో తెలియక డైలమాలో పడ్డారు. జీహెచ్‌ఎంసీ, ఎమ్మెల్యే ఉప ఎన్నికల్లో బీజేపీ పట్టు సాధించడంతో రాష్ట్రంలో పార్టీకి తాకిడి పెరుగుతూ వస్తోంది. పరిగి అసెంబ్లీలో కూడా పోటీ చేసేందుకు అభ్యర్థుల సంఖ్య కూడా పెరిగింది. గతంలో నియోజకవర్గ వ్యాప్తంగా బీజేపీకి కేవలం కుల్కచర్లలో మాత్రమే ఆఫీసు ఉండేది. ఆ పార్టీ తరఫున నాయకుడెవరు అని అడిగితే కరణం ప్రహ్లాదరావు పేరు మాత్రమే వినిపించేది. కానీ ప్రస్తుతం పరిగిలో మరో ఇద్దరు నాయకులు ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేశారు. దీంతో ఆఫీసుల సంఖ్య మూడుకు చేరింది. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతికిరణ్, ఇటీవల బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరిన మిట్ట పరమేశ్వర్‌రెడ్డి పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసి, పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఒక్క నియోజకవర్గంలో పార్టీ మూడు ముక్కలుగా విడిపోవడం పట్ల సీనియర్ నాయకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

బండి రాకతో బయటపడ్డ విభేదాలు

రూప్‌ఖాన్‌పేట్‌లో నిర్వహించిన బీజేపీ కార్నర్ సమావేశానికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ రాక సందర్భంగా నేతల మధ్య విభేదాలు బయటపడ్డాయి. కార్యక్రమానికి వస్తున్న బండిని రెండు కార్యాలయాల వద్దకు తీసుకెళ్లారు. ఈ సమయంలో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. అసమ్మతి ముదరకముందే అధిష్టానం పెద్దలు దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే నష్టం తప్పదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

‘నిల్వ’ స్థలమేదీ?

- పత్తాలేని గోదాముల నిర్మాణం
- ఇరవై ఎకరాలు కేటాయించి రెండేళ్లు పూర్తి
- నిధులు లేక కదలని పనులు
- పాత గిడ్డంగిలో ఈవీఎంల స్టోరేజీ
- ఇబ్బందుల్లో రైతులు



వికారాబాద్‌లోని గిడ్డంగి

వికారాబాద్ అర్బన్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటను నిల్వ చేసేందుకు గోదాములు లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోతలు పూర్తి చేసి కల్లాల్లో నిల్వ చేసిన పంట ఉత్పత్తులు, మార్కెట్‌కు తరలించిన ధాన్యం పలు సందర్భాల్లో వర్షార్పణమవుతోంది. వానాకాలంలో అతివృష్టి కారణంగా ధాన్యం పూర్తిగా తడిసి మొలకెత్తుతోంది. కొన్నిసార్లు గిట్టుబాట ధర లభించకపోయినా నిల్వ చేసే వీల్లేక తక్కువ ధరకు వదిలేసి వెళ్తున్నారు. ఇదే అదనుగా భావిస్తున్న దళారులు కర్షకులను నిండా ముంచుతున్నారు.

స్థల కేటాయింపునకే పరిమితం

వికారాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే ధాన్యాన్ని నిల్వ చేసేందుకు అవసరమైన గిడ్డంగుల నిర్మాణానికి రెండేళ్ల క్రితం మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు అవసరమైన స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరడంతో.. గంగారం రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 26లో పదెకరాలు, ఆలంపల్లి బిల్లా దాఖల్ పరిధిలో మరో పదెకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. ఇరవై ఎకరాల్లో రైతులకు అవసరమైన మార్కెట్, గిడ్డంగుల నిర్మాణానికి అధికారులు నిర్ణయించారు. అన్ని రకాల ధాన్యాన్ని నిల్వ ఉంచేలా ప్రణాళిక తయారు చేయాలని ప్రభుత్వం సైతం ఆదేశించింది. 50శాతం శీతల గిడ్డంగులు నిర్మించేందుకు ప్రపోజల్స్ పంపించినప్పటికీ అవసరమైన నిధులు మాత్రం విడుదల కాలేదు. గతంలో జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి సైతం గోదాముల నిర్మాణంపై హామీ ఇచ్చారు. రెండేళ్లు గడుస్తున్నా ఇది నెరవేరడం లేదు.

ఉన్న ఒక్కటీ నిరుపయోగం

ప్రస్తుత రైతుబజారు సమీపంలో 2016లో గోదాం నిర్మించారు. రెండేళ్ల పాటు ఇక్కడ కందుల కొనుగోళ్లు నిర్వహించారు. కొందరు రైతులు కందులు, ఇతర పంటలను ఇక్కడ నిల్వ చేసుకున్నారు.2018లో జరిగిన శాసనసభ ఎన్నికల కౌంటింగ్‌కు ఈ గోదాం అనుకూలంగా ఉంటుందని నిర్ణయించిన అధికారులు ఈవీఎంలను ఇందులో భద్రపర్చారు.కౌంటింగ్ ముగిశాక కోర్టు కేసు కారణంగా ఈవీఎంలను అందులోనే భద్రపర్చారు.దీంతో రైతులు ధాన్యం నిల్వ చేసుకునే అవకాశం లేకుండాపోయింది.

ఆర్నెళ్లుగా 80 శాతమే!

- నత్తనడకన ఆధార్ సీడింగ్ ప్రక్రియ
- సహకరించని డబుల్ ఓటర్లు, ఇతర పనుల్లో అధికారులు
- బోగస్ ఓటర్ల ఏరివేతలో తీవ్ర జాప్యం





వికారాబాద్: బోగస్ ఓటర్ల ఏరివేతకు అధికారులు చేస్తున్న కసరత్తు నత్తనడకన సాగుతోంది. ఆర్నెళ్ల క్రితం ప్రారంభమైన ఓటరు వివరాలకు ఆధార్ సీడింగ్ ప్రక్రియ ఇప్పటి వరకు 80శాతం మాత్రమే పూర్తవగా.. మిగిలిన వారిలో ఎక్కువ మంది డబుల్ ఓటర్‌గా నమోదై ఉన్న కారణంగానే ఆధార్ కార్డులు ఇచ్చేందుకు సహకరించడం లేదని తెలుస్తోంది. ఆధార్ లింక్ చేయాల్సిన యంత్రాంగం ఇతర పనుల్లో నిమగ్నమవడం కూడా ప్రక్రియ మందగించడానికి కారణమని ఉద్యోగులు చెబుతున్నారు. ఇంటింటికీ వెళ్తున్న బీఎల్‌ఓలు ఆధార్ సీడింగ్ చేస్తున్నారు. ఈ సమయంలోనే ఓటర్ల అభిప్రాయం సైతం తీసుకుంటున్నారు. ఒకే వ్యక్తికి సంబంధించి రెండు లేదా అంతకన్నా ఎక్కువ చోట్ల ఓటరు జాబితాలో పేరు నమోదై ఉంటే ఎక్కడ కొనసాగించాలి..? ఎక్కడ తొలగించాలనే విషయంలో వారి నిర్ణయం మేరకు వివరాలు నమోదు చేసుకుంటున్నారు. దీంతో పాటు వారి ఆధార్ కార్డులు సైతం సేకరిస్తున్నారు. జిల్లాలో 8,83,541 మంది ఓటర్లు ఉండగా వీరిలో ఇప్పటి వరకు 6,99,771 మంది ఓటర్లకు ఆధార్ సీడింగ్ ప్రక్రియ పూర్తి చేశారు. మిగిలిన 1,83,770 ఓటర్లకు ఆధార్ లింక్ చేయాల్సి ఉంది. కొడంగల్, దౌల్తాబాద్ మండలాలు 92శాతానికి పైగా టార్గెట్ పూర్తి చేయగా కోట్‌పల్లి, ధారూరు, మర్పల్లి, పూడూరు, బొంరాస్‌పేట్ మండలాలు 72 శాతంతో వెనకంజలో ఉన్నాయి.

వేలల్లో బోగస్ ఓటర్లు

జిల్లావ్యాప్తంగా బోగస్ ఓటర్లు వేల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. ఆధార్ అనుసంధానం వంద శాతం పూర్తయితేనే వీరిని గుర్తించి, తొలగించే అవకాశం ఉంది. చాలామంది ఓటర్లు గ్రామాలతో పాటు పట్టణ కేంద్రాల్లోనూ ఓటు హక్కు కలిగి ఉన్నారని తెలుస్తోంది. వీరు అటు సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు మెంబర్ ఎన్నికలతో పాటు ఇటు మున్సిపల్ ఎన్నికల్లోనూ ఓటు వేస్తున్నారు.

పారదర్శకంగా..

ఆధార్ కార్డులతో ఓటర్ జాబితాలో ఉన్న పేర్ల అనుసంధానం చేయటం మంచి ప్రక్రియ. ఇది పూర్తయితే ఒక వ్యక్తికి ఒకే చోట ఓటు హక్కు ఉంటుంది. దీంతో బోగస్ ఓటర్లను ఏరివేసే అవకాశం ఉంది. ఓటర్ల ఇళ్ల వద్దకు వచ్చే ఉద్యోగులకు సరైన సమాచారంతో ఆధార్ వివరాలు ఇచ్చి సహకరించాలి.

– అశోక్‌కుమార్, డీఆర్‌ఓ

ప్రభుత్వానిది నయవంచన

- ఉమ్మడి జిల్లా రైతులను నమ్మించి మోసం చేశారు
- చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల: ఉమ్మడి జిల్లా రైతులను ముఖ్యమంత్రి కేసీఆర్ నమ్మించి మోసం చేస్తున్నారని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. చేవెళ్లలో శనివారం సాయంత్రం ఆయన బీజేపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ ప్రాంతానికి గోదావరి జలాలు తీసుకు వచ్చే ప్రాణహిత ప్రాజెక్టు డిజైన్‌మార్చి నీళ్లు రాకుండా చేశాడని మండిపడ్డారు. ప్రాణహిత కాదు పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారానే జిల్లాకు సాగునీరు అందిస్తామని ఇన్నాళ్లు ప్రచారం చేసిన వీరు ఇప్పుడు ఈ ప్రాజెక్టు కేవలం తాగునాటి అవసరాలకోసమే నిర్మిస్తున్నామని సుప్రీంకోర్టుకు నివేదించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లా రైతులకు సాగునీరు అందిస్తామని చెప్పిన మాట అవాస్తవమని వారి మాటల్లోనే అర్థం అవుతోందన్నారు. కేసీఆర్‌కు ఈప్రాంత ప్రజలపై ఎంత ప్రేమ ఉందో ఇప్పటికైనా స్పష్టత వచ్చిందన్నారు. పాలమూరు ప్రాజెక్టు పర్యావరణ అనుమతులు లేకుండా నిర్మిస్తుండటంతో గ్రీన్ ట్రిబ్యూనల్ రాష్ట్ర ప్రభుత్వానికి రూ.828 కోట్లు పరిహారం చెల్లించాలని ఆదేశించినట్లు తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టుకు వెళ్లి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును కేవలం తాగునీటి అవసరాలకే నిర్మిస్తున్నామని స్పష్టం చేసిందన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొనడంతో ఘటన
- పండుగ పూట విషాదం

పూడూరు: ఆగిఉన్న లారీని వెనుకనుంచి బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఘటన చోటు చేసుకుంది. మహాశివరాత్రి పండుగ వేళ మృతుల కుటుంబాల్లో విషాదం అలుముకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా మద్దూరు మండలం నందిగామకు చెందిన నాగంపల్లి శ్రీనివాస్(22), సిద్దిపేట్‌కు చెందిన చందు(24) ఇద్దరు హైదరాబాద్‌లో హోటల్‌లో పని చేస్తున్నారు. జాతర సందర్భంగా శుక్రవారం స్నేహితుడు చందుతో కలిసి శ్రీనివాస్ తన స్వగ్రామమైన నందిగామ గ్రామానికి వచ్చారు. శనివారం తెల్లవారుజామున నందిగామ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా మార్గ మధ్యంలో అంగడిచిట్టంపల్లి గేటు వద్ద ఆగిఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి శ్రీనివాస్ అన్న అంజిలప్ప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపారు. వికారాబాద్ మార్చురీలో పోస్టు మార్టం నిర్వహించి మృత దేహాలను వారి కుటుంబాలకు అప్పగించినట్లు తెలిపారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా

ఇద్దరు కార్మికులకు గాయాలు



బోల్తాపడిన పంచాయతీ వాటర్ ట్యాంకర్

బంట్వారం: గ్రామ పంచాయతీ వాటర్ ట్యాంకర్ ప్రమాదవశాత్తు బోల్తాపడగా ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం ఉదయం కోట్‌పల్లి మండలం ఎన్కెపల్లిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పంచాయతీ కార్మికుడు చంద్రయ్యతో పాటు మరో దినసరి కూలీ చాకలి రాజు కలిసి బృహత్ ప్రకృతి వనంలో మొక్కలకు నీరు పట్టేందుకు ట్యాంకర్ పై వెళ్తున్నారు. ఎన్కెపల్లి సమీపంలోనే వాటర్ ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ నడుపుతున్న చాకలి రాజు తీవ్రంగా గాయపడగా కార్మికుడు చంద్రయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మెరుగైన వైద్యం కోసం చాకలి రాజును నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించినట్లు పంచాయతీ కార్యదర్శి రవి తెలిపారు.

దారులన్నీ భూకైలాస్‌కే..

శివనామస్మరణతో మార్మోగిన దేవాలయం

తాండూరు రూరల్ : అన్ని దారులు భూకైలాస్‌కే.. అంతారం తండాలో వెలిసిన భూకైలాస్ క్షేత్రానికి జనం పోటెత్తారు. శివనామస్మరణతో దేవాలయం మారుమోగింది. దేవస్థానంలో మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగాయి. శనివారం మహాశివ రాత్రి సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శివుడిని దర్శించుకున్నారు. కర్ణాటక, మహారాష్ట్రతో పాటు వివిధ జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ వ్యవస్థాపకులు శంకర్ నాయక్‌పవార్, వాసు నాయక్ పవార్‌లు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి.. స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు.



అంతారం తండాలో స్వామివారి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తజనం



భూకైలాస్‌లో ఆలయం వెలుపల భక్తుల సందడి



స్వామివారి పల్లకీ సేవలో ఆలయ వ్యవస్థాపకులు శంకర్, వాసు పవార్ నాయక్‌లు

వృద్ధుడి అదృశ్యం



అంతయ్య (ఫైల్)

బంట్వారం: వృద్ధుడు అదృశ్యమైన ఘటన కోట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సత్యనారాయణరాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కోట్‌పల్లి మండలం బార్వాద్ గ్రామానికి చెందిన కుమ్మరి అంతయ్య (66) ఈ నెల 15న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు అంతటా ఆరా తీసినా ఆచూకి లభించలేదు. అంతయ్య కుమారుడు నర్సింహులు శనివారం కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

యాలాల: కాగ్నా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను యాలాల పోలీసులు శనివారం ఉదయం పట్టుకున్నారు. ఎస్‌ఐ అరవింద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోకట్ కాగ్నా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు తనిఖీలు చేశారు. కాగ్నా నది నుంచి రెండు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా గుర్తించి పట్టుకున్నారు. పట్టుకున్న వాహనాలను పీఎస్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

22 నుంచి నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

కద్లాల్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండల పరిధిలో ఈనెల 22 నుంచి 28 వరకు మేకలు, గొర్రెల్లో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల పశువైద్యాధికారి భానునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బుగ్గకు పోటెత్తిన భక్తులు



బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

రామలింగేశ్వరుని సన్నిధిలో ప్రముఖుల పూజలు

అనంతగిరి/వికారాబాద్ అర్బన్: శివోహం, శంభో శివశంభో.. హరహరమహాదేవ నామస్మరణలతో శివాలయాలు మారుమోగాయి. మహా శివరాత్రి పర్వదినాన్ని శనివారం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వికారాబాద్‌కు సమీపంలోని బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయం, పార్వతీపరమేశ్వరుల గుట్ట, మల్లికార్జున స్వామి ఆలయం, రాంమందిరం, అనంతగిరి గుట్టతో పాటు పలు శివాలయాలు భక్తకోటితో కిటకిటలాడాయి. భక్తులు తెల్లవారుజామునుంచే ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రి వేళ ఆలయాల్లో లింగోద్భవ కార్యక్రమం చేపట్టారు. పట్టణానికి సమీపంలోని బుగ్గరామలింగేశ్వర ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. క్యూలైన్‌లలో నిలిచి స్వామివారిని దర్శించుకున్నారు. బుగ్గ రామలింగేశ్వర స్వామిని సాయంత్రం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ దంపతులు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరితో పాటు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్ దంపతులు కుటుంబసమేతంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు అధికారులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు నాయకులు, పుర ప్రముఖులు స్వామి వారిని దర్శించుకున్నవారిలో ఉన్నారు. భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి శివునికి ప్రత్యేక పూజలు, అర్చనలు అభిషేకాలు చేశారు. సమీపంలోని శివాలయాలు సైతం భక్తుల రాకతో సందడిగా మారాయి.రాత్రి వేళ అఖండ భజనలు చేస్తూ జాగరణ చేపట్టారు. ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.



బుగ్గలో అభిషేకం చేస్తున్న వికారాబాద్ ఎమ్మెల్యే దంపతులు



బుగ్గలో అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

డబుల్ రోడ్లుగా గ్రామీణ రహదారులు

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: మారుమూల గ్రామాలను పంచాయతీలుగా చేసి వాటి అభివృద్ధికి నిధులు కేటాయించిన ఘనత సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన కుమారుడు, బీఆర్‌ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్ర శుక్రవారం రాత్రి ఇబ్రహీంపట్నం మండలంలోని పోల్కంపల్లిలో జరిగింది. ఇంటింటికి తిరిగి బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం రాత్రి గ్రామంలో జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత క్యామ మల్లేశ్‌లు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... రాష్ట్రంలో రూ.500 కోట్లతో గ్రామీణ రోడ్లను డబుల్‌రోడ్లుగా మారుస్తున్నామన్నారు. అనంతరం బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రశాంత్‌కుమార్‌రెడ్డికి దేవుడి ఆశీస్సులు ఉండాలని.. అంచలంచెలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, ఎంపీపీ కృపేష్, సర్పంచ్‌లు రాంరెడ్డి, ఆండాలు, ఎంపీటీసీ మంగ రవీందర్, టీఆర్‌ఎస్ అధ్యక్షుడు బుగ్గరాములు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ డైరెక్టర్

పోల్కంపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ గునుకుల మల్లేశ్ బీజేపీని వీడి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పార్టీ శాలువ కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు.

సమస్యలు పరిష్కరించండి..

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ తట్టిఅన్నారం జీవీఆర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ ఔట్‌లెట్, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రామ్మోహన్, కౌన్సిలర్ పరశురాం, మాజీ కౌన్సిలర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవా.. పెన్షన్ వస్తుందా?

ఇబ్రహీంపట్నం రూరల్: సంక్షేమ పథకాలు అమలులో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని బీఆర్‌ఎస్ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రగతి నివేదన పాదయాత్ర శనివారం నాగన్‌పల్లిలో కొనసాగింది. ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నాగన్‌పల్లి డబుల్‌రోడ్డు నిర్మాణానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.24.55 కోట్లు ఖర్చు చేసిందన్నారు. గత ఎనిమిదేళ్లుగా గ్రామంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గ్రామంలో వృద్ధులను కలిసి పెన్షన్ వస్తుందా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కృపేష్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బుగ్గరాములు, ఎంపీటీసీ మంగ రవీందర్, నాయకులు అంజయ్య, మల్లేష్, శరత్‌రాయుడు పాల్గొన్నారు.

రాక్షసగూళ్లు కనుమరుగు!

ఇనాంగూడలో పదేళ్ల క్రితం శిలాయుగపు సమాధుల గుర్తింపు

- పూర్తిస్థాయి పరిశీలన చేయడంలో పురావస్తు శాఖ అధికారుల తాత్సారం

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో మూడువేల సంవత్సరాల క్రితం నాటి పురాతన రాక్షసగూళ్లు (శిలాయుగపు) అధికారులు గుర్తించి ఏళ్లు గడుస్తున్నా వాటి రక్షణకు చర్యలు తీసుకోవడం లేదు. ప్రాచీనకాలం నాటి ఆనవాళ్లను రక్షించి వాటి చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉన్నప్పటికీ పురావస్తుశాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో.. ఇటీవల ఎన్‌హెచ్‌ఏఐ వారు చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణలో అవి కనుమరుగు అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం ఇనాంగూడ గ్రామంలోని ఓ ప్రైవేట్ భూమిలో పదేళ్ల క్రితం మూడువేల ఏళ్ల నాటి శిలాయుగపు రాక్షసగూళ్లను పురావస్తుశాఖ అధికారులు గుర్తించారు. విజయవాడ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్నప్పటికీ అధికారులు గుర్తించేంత వరకు స్థానికులకు వాటి గురించి ఎలాంటి అవగాహన లేదు. అయితే పదేళ్ల క్రితం అధికారులు గుర్తించినప్పటి నుంచి కొంతమంది దుండగులు వాటిని తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వాటిల్లో గుప్తనిధులు ఉన్నాయన్న ఆశతోనే తవ్వకాలు చేపట్టేందుకు యత్నిస్తున్నట్లు స్థానికంగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయినప్పటికీ అధికారు లు ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడంలేదు.

రోడ్డు విస్తరణతో పొంచి ఉన్న ముప్పు..

ఇటీవల విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభం కావడంతో మొన్నటి దాకా రోడ్డుకు దూరంగా ఉన్న సమాధులు.. విస్తరణ కారణంగా రోడ్డుకు దగ్గరగా రాగా మరికొన్ని కనుమరుగు అయ్యే అవకాశాలున్నాయి. విస్తరణలో వాటి ఆనవాళ్లు కోల్పోకముందే పురావస్తు శాఖ అధికారులు ఈ శిలాయుగపు రాక్షసగూళ్ల ఆనవాళ్లను మరోసారి పరీక్షించి భద్రపరచాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.



ఇనాంగూడలో ఉన్న రాక్షసగూళ్లు

రాతియుగం మనుషుల వస్తువులతో సమాధి..

రాక్షసగూళ్లుగా పిలువబడే వీటిని శిలాయుగపు మనుషుల సమాధులని పిలుస్తారు. అప్పటి మనుషులు రోగాలబారిన పడి ఒకేసారి మృత్యువాత పడితే వారితో పాటు వారు వినియోగించిన వస్తువులను కూడా ఈ సమాధిలోనే వేసి పూడ్చివేసేవారని అధికారులు తెలిపారు. కాగా వాటిని గుర్తుపట్టేందుకు వీలుగా సమాధులకు చుట్టూరా పెద్దరాళ్లను గుండ్రంగా వలయాకారంగా అమర్చుకునేవారని తెలుపగా ఇక్కడ ఉన్న సుమారు 3, 4 సమాధులు కూడా ఇలాంటి పోలికలతో ఉన్నాయి. పురావస్తు శాఖ అధికారులు పూర్తిస్థాయిలో ఈ సమాధులపై పరిశీలన చేస్తే చరిత్రకు అవసరమైన సమాచారంతో పాటు ఎన్నో అరుదైన వస్తువులు లభించే అవకాశాలున్నాయని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

పండ్ల ధరలకు రెక్కలు

కొడంగల్ : శివరాత్రి పండుగ వేళ పండ్ల ధరలు పెరిగాయి. వ్యాపారులు అధిక ధరలకు పండ్లు విక్రయించారు. ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు తప్పని సరి పరిస్థితుల్లో అధిక ధరలకు కొనుగోలు చేశారు. పేదలు, కూలీలు, సన్న చిన్నకారు రైతులు, చిరుద్యోగులకు అందని ద్రాక్షలా మారాయి. వాటర్‌మిలాన్ ఒక్కోటి రూ. 60 నుంచి రూ 100 ధరకు విక్రయించారు. కర్బూజ కిలో రూ.70, అరటిపండ్లు డజన్ రూ 60, యాపిల్ ఒక్కొటి రూ.30, సంత్ర, దానిమ్మలు కూడా రూ. 30లకు విక్రయించారు.

మార్చి 7వరకు హస్తకళా మేళా

షాద్‌నగర్: చేనేత హస్త కళాకారులను ప్రోత్సహించాలని పట్టణ సీఐ నవీన్‌కుమార్ అన్నారు. పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో కళాభారతి హ్యాండ్ క్రాఫ్ట్, హ్యాండ్ లూమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేనేత హస్త కళా మేళా ఏర్పాటు చేశారు. ఈ మేళాను శనివారం సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేనేత, హస్తకళలు శ్రమైక్య జీవన సౌందర్యానికి ప్రతీకలు అన్నారు. కళాకారులు తయారు చేసిన పోచంపల్లి, కళంకారి, ఖాదీ, మంగళగిరి, గద్వాల్, తదితర చేనేత వస్త్రాలు, కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, హైదరాబాద్ ముత్యాలు, మైసూర్ రోజ్‌వుడ్, కళాత్మక ఆభరణాలు బంజారా వంటి హస్త కళల ఉత్పత్తులు ఎంతో బాగున్నాయన్నారు. ఈ హస్త కళా మేళా మార్చి 7 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షుడు సత్యనారాయణ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వరి సాగుకే రైతుల మొగ్గు

జిల్లాలో పెరిగిన సాగు విస్తీర్ణం

- తగ్గిన జొన్న, కంది, వేరుశనగ
- ఆరుతడి పంటలపై ఆసక్తి కరువు
- అడవి పందులు, పిట్టల బెడదే కారణం



పాత కొడంగల్‌లో బోరు కింద సాగు చేసిన వరి పంట



చెరువుల కింద సాగు చేసిన వరి పొలాలు

కొడంగల్ : జిల్లాలో వరి సాగు వైపే రైతులు మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయాధికారుల అంచనా ప్రకారం గతం కంటే ఈ ఏడాది వరి సాగు పెరిగినట్లు తెలుస్తోంది. నియోజకవర్గంలో గతంలో వర్షాధార పంటలపై ఆధారపడి రైతులు వ్యవసాయం చేసేవారు. ఇప్పుడు చెరువులు, కుంటలు, చిన్నపాటి సాగునీటి ప్రాజెక్టుల కింద అధిక మొత్తంలో వరి సాగు చేస్తున్నారు. జొన్న, కంది, శనగ, పెసర, మినుము తదితర పంటలపై ఆసక్తి తగ్గింది. అడవి పందులు, పిట్టల బెడదే కారణమని రైతులు వాపోతున్నారు.

నీటి వనరులపై ఆధారపడి..

కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్‌తో పాటు జిల్లాలోని ఇతర మండలాల్లో సాగునీటి వనరులపై ఆధారపడి రైతులు పంటలు వేస్తున్నారు. జిల్లాలో 26,1360 హెక్టార్ల భూమి ఉంది. అందులో ఎక్కువ మొత్తంలో వరిసాగు చేస్తున్నారు. కాకరవాణి ప్రాజెక్టు, హస్నాబాద్ చెరువు, కొడంగల్ పెద్ద చెరువు, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ చెరువులతో పాటు కోట్‌పల్లి, జుంటిపల్లి, లక్నాపూర్, సర్పన్‌పల్లి, చిన్నవాగు ప్రాజెక్టుల కింద రైతులు అధిక మొత్తంలో వరి సాగు చేశారు. ఆరుతడి పంటల కంటే వరిపైనే రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు వ్యవసాయం దండగ అన్న చోట పండగ వాతావరణం నెలకొంది. పెద్దగా సాగునీటి వనరులు లేని కొడంగల్ నియోజకవర్గంలో వరిసాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం చెరువులు, కుంటలు, చిన్నపాటి సాగునీటి ప్రాజెక్టులతో పాటు బోర్ల కింద వరి సాగు చేస్తున్నారు. నీటి వనరులు పెరగడంతో వరి ధాన్యం దిగుబడులపై రైతులు దృష్టి పెట్టారు. ధర్మం పంటగా పేరుగాంచిన జొన్న కనుమరుగైంది. అడవి పందులు, పిట్టల బెడదతో వాణిజ్య పంటలను సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. ఒకప్పుడు వలసలు, కరువు కాటకాలతో దుర్భిక్షం నెలకొన్న పాలమూరు జిల్లాలో నేడు పంటలకు కొదవ లేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు వికారాబాద్ జిల్లాలో సాగునీటి లభ్యత పెరగడంతో వానాకాలం, యాసంగి అనే తేడా లేకుండా పంటల సాగు గణనీయంగా పెరిగింది. వ్యవసాయ శాఖ అధికారులు ఇటీవల నిర్వహించిన సాగు సర్వేలో సంప్రదాయ పంటలు ఆరుతడి సాగుపై రైతులు అనాసక్తి చూపుతున్నట్లు తేలింది. గతంలో వరితో పాటు జొన్న పత్తి కంది పెసర మినుము తదితర పప్పు దినుసు పంటలను సాగు చేసేవారు. ఆయా ప్రాంతాల్లో భూమి స్వభావం దిగుబడి వాతావరణ పరిస్థితులను అంచనా వేసుకొని రైతులు పంటలను సాగు చేసేవారు. అయితే వరికంటే ఇతర పంటల సాగుచేస్తే ఖర్చుతో పాటు కష్టం ఎక్కువగా ఉందని రైతులు భావిస్తున్నారు. దీంతో సాగునీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో వరి ధాన్యం పండిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో పంటల వివరాలు

యాసంగి పంటల సాగు విస్తీర్ణం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. సాగులో ఉన్న ప్రతి గుంటను లెక్కించి పంటల వివరాలను సేకరిస్తున్నారు. వరి విస్తీర్ణం జిల్లాలో పెరుగుతున్నట్లు అధికారులు లెక్కలు వేస్తున్నారు.

కళాకారులను ప్రోత్సహిస్తాం

ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి

తలకొండపల్లి: కనుమరుగవుతున్న ప్రాచీన కళలను, కళాకారులను ప్రోత్సహిస్తామని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చుక్కాపూర్‌లో త్వరలో యాదవ్వులు భ్రమరాంబ మల్లికారునస్వామి నాటకాన్ని ప్రదర్శించనున్నారు. ఈ మేరకు వారు నాటకానికి ఆర్థికసహాయం అందజేయాలని ఇటీవల ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డిని కలిసి కోరారు. వారి విజ్ఞప్తి మేరకు రాఘవేందర్‌రెడ్డి శనివారం మల్లప్పగుట్ట మల్లికార్జున స్వామి దేవాలయంలో కళాకారులకు రూ.35,000 అందజేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ స్వప్నా భాస్కర్‌రెడ్డి, పాండయ్య, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.